మహిళా వైద్యులకు భద్రత పెంచాలి



వైద్యులకు, వైద్య సిబ్బందికి నూరు శాతం రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం దుర్మార్గపు చర్య. ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్టు వేయాలంటే ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. మహిళా వైద్యులకు భద్రత కల్పించే విషయమై శ్రద్ధ చూపాలి. రాత్రి వేళల్లో బీట్ కానిస్టేబుల్ వైద్యశాలలకు రక్షణగా ఉండాలి.

–డాక్టర్ రాయపూడి హనుమంతురావు, పెదకూరపాడు

ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలి



వైద్యులపై దాడులు జరిగినప్పుడు స్పందించడం కంటే జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులు చిన్నతనం నుంచే మహిళలతో గౌరవంతో మెలిగేలా మగ పిల్లలకు నేర్పించాలి. మత్తుకు బానిసలు కాకుండా చూడాలి. వైద్యశాలల్లో రాత్రి విధులు నిర్వహించే వైద్యులకు రక్షణగా కానిస్టేబుల్ ఉండాలి.

–డాక్టర్ జోన్నలగడ్డ చైతన్య, పెదకూరపాడు,సీహెచ్‌సీ

క్లుప్తంగా

రేపు పింఛన్‌ల పంపిణీ

నకరికల్లు: సామాజిక పింఛన్‌లు శనివారమే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు అందుకోలేక పోయిన వారికి సెప్టెంబర్ 2న అందజేస్తామన్నారు. పింఛన్‌దారులు గమనించి, అందుబాటులో ఉండాలని సూచించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమరావతి: తాడికొండ మండల పరిధిలోని మోతడక గ్రామం వద్ద నూతన లేన్ల నిర్మాణం కారణంగా శనివారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన

రాజుపాలెం: పంట కోత ప్రయోగాలను వ్యవసాయ సహాయకులు జాగ్రత్తగా నిర్వహించాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య తెలిపారు. మండలంలోని కోటనెమలిపురి రైతు సేవా కేంద్రంలో పంటకోత ప్రయోగాలపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పంటకోత ప్రయోగాల విధానంపై ఏవో వివరించారు. ఈ ప్రయోగాలు పూర్తిస్థాయిలో నిర్వహించి రైతులకు మేలు జరిగే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సత్తెనపల్లి: బార్బర్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని త్యాగరాజు మందిర కమిటీ ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల సుబ్బారావు అన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి సత్తెనపల్లి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పత్తిపాటి హరేకృష్ణ, కార్యదర్శి కామేశ్వరరావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఆంజనేయులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

కోట నెమలిపురిలో పొలం బడి

రాజుపాలెం: సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచి, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య పేర్కొన్నారు. మండలంలోని కోట నెమలిపురిలో వరిలో పొలం బడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి తదితర అంశాలను రైతులకు ఏఓ వివరించారు. సహజ సిద్ధ వనరులతో సాగు చేయడం, భూ సార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వాడాలని సూచించారు. వేప గింజల కషాయంతో శత్రు పురుగులను నివారించుకోవచ్చని తెలిపారు. వీఏఏ జి.జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్ సెంటర్‌లో కార్డన్ సెర్చ్



రాజుపాలెం: మండలంలోని సమస్యాత్మక గ్రామమైన చౌటపాపాయపాలెం ఆర్.ఆర్ సెంటర్‌లో సత్తెనపల్లి సీఐ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కార్డన్ సెర్చ్ గురువారం నిర్వహించారు. వినాయ చవితి పండగ సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా సెర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ వేణుగోపాల్ తెలిపారు. గ్రామంలో తనిఖీలు నిర్వహించి, గంజాయి, అక్రమ మద్యం, నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైన ఇలాంటి చర్యలకు పాల్పడితే 94407 96222 నంబరుకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నకరికల్లు ఎస్ఐ సురేష్, సత్తెనపల్లి సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



పెదకూరపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య జన్మదిన వేడుకలను గురువారం పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మీరయ్య మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, అభిమానులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యోహాను, చిట్టిబాబు, చినమక్కెన మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మైనార్టీ నాయకులు షేక్‌బాజీ, బీసీ సంఘ నాయకులు సాంబశివరావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

అగ్గి రాజుకుంటే మిగిలేది బూడిదే..!

- ఐదు మండలాలకు ఫైర్ స్టేషన్ లేని వైనం
- అమరావతిలో అగ్ని ప్రమాదల నివారణ శూన్యం
- స్థలమున్నా.. భవన నిర్మాణానికి పడని అడుగు
- ప్రసిద్ధ పర్యాటక ప్రాంతంలో తప్పని భయం..



ఫైర్ స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో బోర్డు



ముత్తాయపాలెంలో వరిగడ్డి వామి మంటలార్పుతున్న గ్రామస్తులు(ఫైల్

అమరావతి: రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజక వర్గం పెదకూరపాడు. మొత్తం ఐదు మండలాలకు కలిపి క్రోసూరులో ఉన్న కొద్దిపాటి సామర్థ్యం గల అగ్నిమాపక కేంద్రం కూడా మూతపడింది. దీంతో అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, పెదకూరపాడు మండలాల్లోని సుమారు 100 గ్రామాలకు ఒక్క అగ్నిమాపక కేంద్రం కూడా లేదు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగితే.. సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పరుగులు తీయాల్సి వస్తోంది. వారు సమాచారం అందుకుని వచ్చేసరికి బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో గత నాలుగేళ్లుగా జరిగిన అగ్ని ప్రమాదాల్లో యాభై శాతం ఆస్తులు, ఇళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. నష్టం జరిగాక అగ్నిమాపక సిబ్బంది వచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రం అమరావతిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్నోమార్లు ప్రజల నుంచి అధికారులకు వినతులు వెళ్లాయి. అమరావతి పరిసర గ్రామాల్లో ఏ చిన్న ప్రమాదం సంభవించిన సత్తెనపల్లి, గుంటూరు, మంగళగిరి వంటి దూర ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనం రావాల్సి పరిస్థితి. పెదకూరపాడు నియోజవర్గానికి ఎటుచూసిన సుమారు 40 కిలోమీటర్ల దూరంలో అగ్నిమాపక కేంద్రం లేదు. అమరావతి కేంద్రంగా అగ్నిమాపక కేంద్ర ఏర్పాటు చేస్తే నియోజకవర్గంలోని సుమారు 60 గ్రామాలకు సేవలందించడానికి వీలు కలుగుతుంది.

క్రోసూరు ఫైర్‌స్టేషన్ మూసేశారు

గత ఐదేళ్లుగా ప్రైవేటు ఏజెన్సీకి ద్వారా క్రోసూరులో నడుపుతున్న తాత్కాలిక అగ్నిమాపక కేంద్రం కాంట్రాక్టు గడువు ముగియటంతో మూసేశారు. ప్రస్తుతం నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రోసూరులో తాత్కాలిక ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడంతో పాటు.. అమరావతిలో శాశ్వత ఫైర్ స్టేషన్ నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు ఇలా..

గత ఐదేళ్లలో పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 180 అగ్ని ప్రమాదాలు జరిగాయి. పెదకూరపాడులో 37, అమరావతిలో 14, క్రోసూరులో 64, అచ్చంపేటలో 53, బెల్లంకొండలో 12 అగ్నిప్రమాదాలు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి

సంవత్సరం	పెదకూరపాడు	అమరావతి	క్రోసూరు	అచ్చంపేట	బెల్లంకొండ	మొత్తం ప్రమాదాలు
2020-21	7	2	1	--	--	10
2021-22	6	4	22	20	02	54
2022-23	9	4	23	14	02	52
2023-24	7	3	12	16	04	42
2024-25	8	1	06	03	04	22

స్థలముంది..నిర్మాణమేదీ..

అమరావతిలో అగ్నిమాపక కేంద్రం నిర్మించడానికి ప్రభుత్వం సుమారు ఆరు సెంట్లకుపైగా స్థలం రెవెన్యూ శాఖ ద్వారా అగ్నిమాపకశాఖకు కేటాయించింది. ఎనిమిదేళ్లు దాటినా ఇంతవరకు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉంది. స్థలంలో అగ్నిమాపక శాఖకు చెందిన స్థలమని బోర్డు మాత్రం ఏర్పాటు చేశారు. నేడు స్థలంలో పిచ్చి చెట్లు పెరిగిపోయాయి.

ఆస్తినష్టం కలగకుండా చూడాలి



అమరావతిలో అగ్నిమాపకదళ కేంద్రం ఉంటే ఆస్తినష్టం, ప్రాణాల్ని కాపాడొచ్చు. ఎక్కడో దూరం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి నష్టం జరిగిపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదాల పట్ల జాగ్రత్తలపై ముందస్తుగా సూచనలు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

– నాయుడు సాంబశివరావు, ఎండ్రాయి, అమరావతి

నిర్మాణం చేపట్టాలి



అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన అమరావతిలో అమరావతి మ్యూజియం, స్థూపం, పర్యాటకశాఖ మ్యూజియం, అమరేశ్వరస్వామి దేవాలయాలున్నాయి వీటిని కాపాడు కోవడానికి తప్పక అగ్నిమాపక కేంద్రం ఉండాలి. ఉన్నతాధికారులకు ఎన్నో వినతులు సమర్పిస్తే స్థలం మంజూరైంది. ఇప్పటికైన అధికారులు నిర్మాణ పనులు చేపట్టాలి.

– డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు

నివేదికలు పంపాం

క్రోసూరులో ప్రైవేట్ ఏజెన్సీ కాంట్రాక్టు ముగియడంతో అగ్నిమాపక కేంద్రం నిలిపివేశారు. త్వరలో కాంట్రాక్టు పద్ధతిన ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటున్నాం. అమరావతి అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి సప్థలం కేటాయించారు. నిర్మణానికి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాం. త్వరలోనే శాశ్వత అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి కృషి చేస్తాం.

– ఎంవీ సుబ్బారావు, ఇన్‌చార్జి ఎస్ఎఫ్‌వో, సత్తెనపల్లి.

హోటల్‌లో అగ్నిప్రమాదం



అమరావతి: మండల కేంద్రంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న శ్రీశంకర్ విలాస్ హోటల్‌లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రాత్రి 8.15 గంటల సమయంలో హోటల్ గ్యాస్ పొయ్యికి అమర్చిన పైప్ నుంచి మంటలు రావడం మొదలై సిలిండర్ వరకు వ్యాపించాయి. ఈ నేపథ్యంలో హోటల్‌లో ఉన్న వినియోగదారులు, హోటల్ సిబ్బంది, చుట్టుపక్కల దుకాణదారులు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా రోడ్డుపైకి పరుగులు తీశారు. స్థానికులు, సమీపంలోని షాపులవారు తమ వద్ద ఫైర్ సేఫ్టీ సిలిండర్లు తెచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై అమరావతి పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఈఓ వద్దు.. ఏసీ కావాలి

అమరావతి: స్థానిక అమరేశ్వరాలయానికి సహాయ కమిషనర్ స్థాయి అధికారిని నియమించి, తద్వారా దేవాలయ అభివృద్ధికి తోడ్పాటు నందించాలని మండల బీజేపీ నాయకుడు, మాజీ ఆలయ పాలకవర్గ సభ్యుడు నేరెళ్ల హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడు అమరేశ్వరాలయానికి సుమారు ఆరు నెలల క్రితం దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సహాయ కమిషనర్ స్థాయి ఇవ్వడం జరిగింది. ఈ క్రమంలో సాధారణ బదిలీల్లో మళ్లీ గ్రేడ్–1 ఈఓను నియమించకుండా.. సహాయ కమిషనర్ స్థాయి అధికారిని నియమి ంచాలని భక్తుల తరుపున కోరుతున్నామన్నారు. అమరేశ్వరాలయానికి తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్న భూములకు సంబంధించి కోర్టు వివాదాలు పర్యవేక్షణ, ఆలయ నిర్వాహణ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను సమర్థంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



శిశుమందిర్‌లో అక్షరాల ప్రదర్శన

అమరావతి: స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో గిడుగు రామ్మూర్తి జన్మదినోత్సవం పురస్కరించుకొని గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాడు కె.వెంకటేశ్వరరావు తెలుగు భాషను కాపాడుకుందామని, తెలుగు జాతిని నిలబెట్టుకుందామని చిన్నారులకు వివరించారు. వ్యవహారిక భాషలోనే అచ్చు పుస్తకాల ముద్రణకు రామ్మూర్తి కృషి అనిర్వచనీయమన్నారు. చిన్నారులు తెలుగు పద్యాలు, పాటలు చక్కగా పాడి వినిపించారు. పాఠశాల పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు .

క్రీడల్లోనూ రాణించాలి

సత్తెనపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని హోలీ ఫ్యామిలీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయారాణి అన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం పాఠశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపడంతో వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.అచ్చిరెడ్డి ఉన్నారు.

గురుకుల పాఠశాలలో తెలుగు బాషా దినోత్సవం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలోని మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం గురువారం నిర్వహించారు. గిడుగు వెంకటరామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మునిరత్నమ్మ పాల్గొని, గిడుగు వెంకటరామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌ల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా దినోత్సవం..

క్రోసూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విద్యార్థులకు పద్య, పాట, వక్తృత్వం, రచనలో పోటీలు నిర్వహించారు. క్రీడా దినోత్సవం , ధ్యాన్‌చంద్ 119 జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం జి.రామాంజనేయులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యాయుడు చిల్కా సురేష్ బహుమతులు ప్రధానం చేశారు.



క్రీడాకారులతో సిస్టర్ విజయారాణి, అచ్చిరెడ్డి

జాతీయ క్రీడా దినోత్సవం

అచ్చంపేట: జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూలులో గురువారం ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్, తెలుగు భాషా కోవిదుడు గిడుగు రామమూర్తి చిత్రపటాలకు ఎంఈఓ ఏకుల ప్రసాదరావు, ఉపాధ్యాయులు పూలామాలలు వేసి, ఘన నివాళులర్పించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఈవో ఏకుల ప్రసాదరావు పాల్గొని క్రీడా ప్రాముఖ్యతను వివరించారు. గతేదాది జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించిన పోలిశెట్టి నరేంద్రను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. పాఠశాల నుంచి జాతీయ పోటీల్లో పాల్గొన్న పది మంది క్రీడాకారులను ఎంఈవో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అలరించిన విద్యార్థుల వేషధారణలు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

పెదకూరపాడు: పెదకూరపాడు , 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవి దర్శి శేషారావును, ప్రముఖ కబడ్డీ క్రీడాకారుడు జి.బాబూరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకటరామమూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు.లీ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణ, శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, శ్రీను, లయన్స్ క్లబ్ నిర్వాహకుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఆధునికవి దర్శి శేషారావుకు సత్కారం

గర్భిణులకు హెచ్ఐవీ టెస్ట్ తప్పనిసరి



అవగాహన ర్యాలీ..

సత్తెనపల్లి: గర్భిణులు హెచ్.ఐ.వి పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.అరుణ అన్నారు. గురువారం సత్తెనపల్లిలోని అంగన్‌వాడీ క్లస్టర్ సమావేశంలో 'మీకు తెలుసా?' హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ సిఫిలిస్ పరీక్ష కూడా చాల ముఖ్యమన్నారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్ యాక్ట్ 2017, టోల్ ఫ్రీ నంబర్ 1097 గురించి, గర్భిణులకు అందించే ఆరోగ్య సేవలను తెలియజేశారు. పరిశుభ్రత చర్యలను వివరించారు. హ్యాండ్స్ అఫ్ కంపాషన్ ప్రాజెక్టు నాగలక్ష్మి, ఈశ్వర్, స్వర్ణలత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ముప్పాళ్ళ: మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, వారి తల్లిదండ్రులు కూడా చట్టపరమైన చర్యలకు అర్హులవుతారని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మైనర్ డ్రైవింగ్ పై అవగాహన సదస్సు గురువారం జరిగింది. అపరిచిత వ్యక్తులతో సంభాషిండం సురక్షితం కాదని, గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.నాగేంద్రమ్మ, ఏఎస్సై నవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ

ఆవులవారిపాలెం(క్రోసూరు): గుంటూరు, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో నరసారావుపేట జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు మండలంలోని ఆవులవారిపాలెం గ్రామ సచివాలయంలో గురువారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్, గుంటూరు సీనియర్ శాస్త్రవేత్త వెంకట రాములు మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. క్రోసూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు వి.హనుమంతరావు మాట్లాడుతూ రైతులు పెట్టుబడి ఖర్చును వీలైనంత తగ్గించుకోకోవాలన్నారు. రసాయన రహిత, నాణ్యమైన ఉత్పత్తులు పండిస్తే.. మార్కెట్లో అధిక ధర లభిస్తుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం, నరసరావుపేట వ్యవసాయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణం ఆధారంగా రైతులు వ్యవసాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అధికారులు గ్రామంలోని ప్రత్తి పంటను క్షేత్ర సందర్శన చేసి, రసం పీల్చు పురుగులు పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగులు ఉన్నట్లు గుర్తించారు. సస్యరక్షణ చర్యలు రైతులకు వివరించారు. ఏఓ వేణుగోపాల్, సర్పంచ్ శ్రీను, సిబ్బంది బి.హరికృష్ణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త వెంకట రాములు

ఆదివాసీల సంఘీభావ సదస్సు కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న షేక్.మస్తాన్‌వలి, వి.కోటానాయక్

నకరికల్లు: దేశంలోని సహజ వనరులను కొల్లగొట్టి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎత్తుగడలను వ్యతిరేకిస్తున్న ఆదివాసీలపై దాడులను ఖండిస్తూ సెప్టెంబర్ 1న నెల్లూరులో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. ఆదివాసీ పోరాటాలకు సంఘీభావంగా నిర్వహించనున్న సదస్సు కరపత్రాలను స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యభారతం, మణిపూర్, కాశ్మీర్ తదితర ప్రాంతాల్లోని సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. నెల్లూరు పట్టణంలోని టౌన్ హాల్లో దక్షిణ కోస్తా ప్రాంతీయ సదస్సు జరుగుతుందన్నారు. సదస్సుకు ఎందరో ప్రముఖులు హాజరై ప్రసంగిస్తారన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాంకడావత్ కోటానాయక్, లాలూ, మల్లారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చించి, ఆమోదించడం జరుగుతుందని తెలిపారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.